సాక్షి
శ్రీకాకుళం

మంగళవారం । 19 । నవంబర్ । 2024



అర్జీల హోరు.. నిరసనల జోరు

జిల్లా కేంద్రంలో నిరసన గళాలు వినిపించాయి. కలెక్టర్‌కు అర్జీలు కూడా అందించారు.

- 8లో



బోటు బోల్తా.. వ్యక్తి మృతి

అల్లివలస సముద్ర తీరంలో బోటు బోల్తా పడింది. ఓ మత్స్యకారుడు మృతి చెందాడు.

- 8లో

నేడు ఆదిత్యుని హుండీ కానుకల లెక్కింపు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఆలయ అనివెట్టి మండపంలో నిర్వహిస్తున్నామని ఆలయ ఈఓ వై.భద్రాజీ తెలియజేశారు. గ్రామపెద్దలు, ఆలయ అధికారులు అర్చకుల సమక్షంలో హుండీలను తెరిపించి నిబంధనల ప్రకారం లెక్కింపు చేపడుతున్నట్లుగా వివరించారు. ఇప్పటికే పోలీస్, రెవెన్యూ తదితర సంబంధిత శాఖాధికారులకు సమాచారాన్ని అందజేశామని ప్రకటించారు.

సంక్షోభంలో సంక్షేమం

'చలి'ంచరా..?



ఎల్.ఎన్.పేట:తలుపుల్లేని కిటికీలు

ఎల్ఎన్ పేట: లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహంలో 72 మంది ఉన్నారు. హాస్టల్‌కు బోరు, బావి లేదు. కొన్ని నెలల క్రితం వరకు ఉన్న బోరు మట్టితో కప్పి పెట్టుకుపోయింది. దీంతో మెగా రక్షిత తాగునీటి పథకం నుంచి ఒక కుళాయి ఏర్పాటు చేశారు. ఆ నీరే అన్నింటికీ ఆధారం. ఇన్వర్టర్ లేకపోవడంతో కరెంటు పోతే నరకం చూడాల్సి వస్తోంది. భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది. చలికాలం వచ్చేసినా ఇంకా దుప్పట్లు, రగ్గులు పూర్తిస్థాయిలో ఇవ్వలేదు.

చీకటిలో ఉంటున్నాం..



కరెంటు పోతే చీకటిలోనే ఉంటున్నాం. చదువుకునేందుకు ఇబ్బందిగా ఉంది. నిద్రపోయాక దోమల బెడద తప్పడం లేదు.

– టి.వంశీ, హాస్టల్ విద్యార్థి, 9వ తరగతి, లక్ష్మీనర్సుపేట

కాస్మొటిక్ చార్జీల్లేవు



హాస్టల్ విద్యార్థులకు ప్రతి నెల ప్రభుత్వం నుంచి వచ్చే కాస్మొటిక్ చార్జీలు కొన్ని నెలలుగా ఇవ్వటం లేదు. స్నానాలకు, ఇతర అవసరాలకు నీరు లేకపోవటంతో ఇబ్బందిగా ఉంది.

– బమ్మిడి కిరణ్, విద్యార్థి, 9వ తరగతి, లక్ష్మీనర్సుపేట హాస్టల్,

అప్పు చేసి పప్పు కూడు



పాతపట్నం ఎస్సీ బాలికల వసతి గృహం

పాతపట్నం: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అప్పు చేసి పప్పు కూడా పెట్టాల్సి వస్తోంది. పాతపట్నంలోని బాలుర ప్రీ మెట్రిక్ వసతి గృహంలో 76 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ టెక్కలి వార్డెన్ ఇన్‌చార్జిగా ఉన్నారు. వారానికి రెండు రోజులు మాత్రమే వస్తున్నారు. మెనూకు అవసరమైన నిధులివ్వడంలో విపరీతమైన జాప్యం జరుగుతోంది. ఎస్సీ బాలికల వసతి గృహంలో 49 మంది విద్యార్థినులు ఉన్నా ఇక్కడ కూడా వార్డెన్ వారానికి రెండు రోజులే వస్తున్నారు. హాస్టళ్ల విద్యార్థులకు కాస్మొటిక్ చార్జీలను గత ప్రభుత్వం నేరుగా వారి తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేసేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఆ చార్జీలు ఇవ్వకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

చలికాలం వచ్చేసింది.. అయినా దుప్పట్లు, రగ్గుల పంపిణీ పూర్తి కాలేదు. హాస్టళ్లు తెరిచి ఐదునెలలు దాటింది.. అయినా కాస్మొటిక్స్ చార్జీలు చెల్లించలేదు. వేసవిలో ఊడిన తలుపులు బిగించిన దాఖలాలు లేవు. పాడైన భవనాల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. వార్డెన్లు అప్పు చేసి పప్పు కూడు పెడుతుంటే స్పందించిన నాయకుడూ లేడు. రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల రక్షణపై సాక్షాత్తు హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. విద్యార్థులకు రక్షణ కల్పించాలని సూచించింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని హాస్టళ్ల పరిస్థితిని 'సాక్షి' పరిశీలించింది. ఈ విజిట్‌లో ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి.

భద్రత డొల్ల.. ఉండేదెలా..?

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

హాస్టళ్లు కాదు.. సమస్యల లోగిళ్లు

- కూటమి ప్రభుత్వంలో కనిపించని సంక్షేమం
- ఎనిమిది నెలలుగా మెస్‌చార్జీలు పెండింగ్
- అప్పులతో నడవలేక వార్డెన్ల అవస్థలు
- ఆరు నెలలుగా విడుదల కాని కాస్మొటిక్ చార్జీలు
- ఉన్న వాటికే నిధులివ్వని కూటమి ప్రభుత్వం హైకోర్టు ఆదేశాల మేరకు ముందుకెళ్లగలదా?

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

సంక్షేమ వసతి గృహాల్లో సంక్షేమం కరువైపోయింది. జిల్లాలో 31 ఎస్సీ సంక్షేమ వసతి గృహాలుంటే వాటిన్నంటిలోనూ ఏదో ఒక సమస్య ఉంది. వాటిని పరిష్కరించేందుకు, మరమ్మతులు చేసేందుకు రూ.4.32కోట్లు అవసరమని, వెంటనే మంజూరు చేయాలని అధికారులు ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి పంపించారు. కానీ, ఒక్క రూపాయి ఇంతవరకు విడుదల చేయలేదు. అలాగే జిల్లాలో 58 బీసీ వసతి గృహాల్లో సమస్యలున్నాయి. వాటిని పరిష్కరించేందుకు రూ.8కోట్లు కావాలని కూటమి ప్రభుత్వానికి నివేదించగా ఇంతవరకు ఒక్క పైసా విడుదల చేయలేదు. జిల్లాలో ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో 10,268 మంది విద్యార్థులు చదువుతుండగా వీరికి ఆరు నెలలుగా కాస్మొటిక్ చార్జీలు చెల్లించడం లేదు. రూ. 60 లక్షల వరకు కాస్మొటిక్ బకాయిలు పేరుకుపోయాయి. ఇంతవరకు ఒక్క రూపాయి కూడా కూటమి ప్రభుత్వం విడుదల చేయలేదు. జిల్లాలో ఎస్సీ, బీసీ వసతి గృహాలకు ఎనిమిది నెలలుగా మెస్‌చార్జీలు చెల్లించడం లేదు. రూ. 23.60కోట్లు మేర బిల్లులు బకాయి ఉండటంతో వార్డెన్లు నరకయాతన అనుభవిస్తున్నారు.

సమస్యల నిలయాలు..

జిల్లాలోని పలు హాస్టళ్లను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు–నేడు కింద బాగు చేసింది. కానీ కూటమి ప్రభుత్వం వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో అలసత్వం వహిస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారం ఆహారం వడ్డించడానికి నిధుల్లేని పరిస్థితి నెలకుంది. ఎనిమిది నెలలుగా మెస్‌చార్జీలు చెల్లించడం లేదు. పిల్లలకు ఇవ్వాల్సిన కాస్మొటిక్ చార్జీలను సైతం ఎగ్గొట్టింది. నిధుల్లేక వసతి గృహాల నిర్వహణ గాలిలో దీపంలా మారింది.

దుర్భర పరిస్థితి..

- శిథిలావస్థలో ఉన్న భవనాలు, శ్లాబ్‌లు పెచ్చులూడిన పరిస్థితులు ఉన్న వసతి గృహాలు దయనీయంగా తయారయ్యాయి.
- పిల్లలకు తగినన్ని గదుల్లేవు. పాడైన ట్రంకు పెట్టెలు ఎక్కడికక్కడ కనిపిస్తున్నాయి.
- విరిగిన తలుపులు, కిటికీలు, పగిలిన నీటి కుళాయిలు, లీకేజీలు, పనిచేయని మరుగుదొడ్లు ఇలా ఒకటేంటి అనేక సమస్యలు దర్శనమిస్తున్నాయి.
- చలికాలం వచ్చినా ఇంకా దుప్పట్లు, రగ్గుల పంపిణీ సంపూర్ణంగా జరగలేదు.
- చాలా చోట్ల దోమ తెరలను ఏర్పాటు చేయలేదు.

వార్డెన్ల పరిస్థితేంటి..

- సంక్షేమ హాస్టళ్లలో మెస్‌చార్జీలు, కాస్మొటిక్ ఛార్జీల బకాయిలు పేరుకుపోయాయి.
- బీసీ, ఎస్సీ వేల్ఫేర్ హాస్టళ్లకు సంబంధించి రూ.23.60కోట్ల మేర బిల్లులు ఎనిమిది నెలలుగా విడుదల కావడం లేదు. నిధులు లేక వార్డెన్లు చేతులెత్తేసే పరిస్థితి వచ్చింది.
- కొత్తగా అప్పులు పుట్టే పరిస్థితి లేదని, ప్రభుత్వ బిల్లులు విడుదల చేస్తేనే విద్యార్థులకు మెనూ అమలు చేయగలమని చెబుతున్నారు.
- కాస్మొటిక్స్ చార్జీల పరిస్థితి కూడా అంతే. ఆరు నెలలుగా నిధులు విడుదల కాలేదు.

హాస్టల్స్‌లో భద్రత డొల్ల..

- సంక్షేమ హాస్టళ్ల దుస్థితిపై తాజాగా హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. భద్రత లేదని ఆక్షేపించింది. క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఆ వ్యాఖ్యలకు అద్దం పట్టేలా ఉన్నాయి. చాలా వసతి గృహాలకు ప్రహరీ లేదు. సోలార్ ఫెన్సింగ్ సిస్టమ్ అనేది ఎక్కడా లేదు. సీసీ కెమెరాల ఊసే లేదు. ఇలా పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని హైకోర్టు కొన్ని సూచనలు చేసింది.
- హాస్టల్ భవనం చుట్టూ ప్రహరీ నిర్మించాలి. గేటు ఏర్పాటు చేయాలి.
- గోడపై సోలార్ ఫెన్సింగ్ వేయాలి. హాస్టల్‌కు వచ్చి, వెళ్లే వారి వివరాలు నమోదుకు రిజిస్టర్ ఉండాలి.
- హాస్టల్ ప్రవేశ మార్గాలు, కారిడార్, కామన్ ఏరియాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. సంబంధిత ఫుటేజీను అనధికార వ్యక్తులు వినియోగించకుండా చర్యలు తీసుకోవాలి.
- బాత్‌రూమ్‌లు, టాయిలెట్లు పరిశుభ్రంగా నిర్వహించాలి. వ్యక్తిగత సమస్యల పరిష్కారం కోసం మానసిక వైద్యులను అందుబాటులో ఉంచాలి.

● భయం భయం



శిథిలమైన ఆమదాలవలస బీసీ బాలికల వసతి గృహం

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణంలోని మెట్టక్కివలసలో బీసీ బాలికల వసతి గృహం శిథిలావస్థలో ఉంది. గదుల పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి. హాస్టల్ ఆవరణలోనే చెత్త కుప్ప కనిపిస్తోంది.



శ్లాబ్ ఊడి పెచ్చులు పడుతున్న బారువ కొత్తూరు, వాడపాలేం వెనుకబడిన తరగతుల బాలికల వసతిగృహ భవనం

● సమస్యల తిష్ట

సోంపేట: మండలంలోని సోంపేట సాంఘిక సంక్షేమ బాలికల, బారువ కొత్తూరు వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. బారువ కొత్తూరు బాలికల వసతి గృహంలో పిల్లలు రాత్రిళ్లు ఉండలేక ఇళ్లకు వెళ్లిపోతున్నారు. సోంపేట వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహంలో టాయిలెట్స్‌కు మూడు నెలలుగా తలుపులు లేవు. మామిడి పల్లి వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరుకుంది. ఈ ప్రాంతంలో అడవి పందులు, ఎలుగు బంట్ల సంచారం ఉంది.



ఆమదాలవలస: బీసీ బాలికలవసతి గృహంలో పెచ్చులూడుతున్న పైకప్పు

● వసతే సమస్య



దుప్పలవలసలో శిథిలావస్థకు చేరుతున్న డార్మిటరీ భవనాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గురుకుల పాఠశాలలో 570 మంది విద్యార్థినులు ఉన్నారు. వసతి ప్రధాన సమస్య. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు మరుగుదొడ్లు, డార్మిటరీలు లేవు. పాత భవనాలు పాడైపోయాయి. దుప్పలవలస గురుకుల పాఠశాల ప్రహరీ అసంపూర్తిగా ఉంది.

● ఉండేదెలా..?



మురుగు నీరు చేరడంతో నిరుపయోగంగా ఉన్న కొత్తూరు ఎస్సీ బాలుర వసతి గృహం

కొత్తూరు: కొత్తూరు మండలంలోని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కురిగాం, కొత్తూరు ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలు దారుణ పరిస్థితుల్లో ఉన్నాయి. ఈ హాస్టళ్ల పరిసరాల్లో దుర్గంధం వ్యాపిస్తోంది. భవనాలు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి.

● రక్షణ ప్రశ్నార్థకం



కళాశాల వసతి గృహంలో అపరిశుభ్రంగా ఉన్న వాటర్ ట్యాపులు

నరసన్నపేట: మండలంలో వసతి గృహాలు ఏడు ఉన్నాయి. వీటిలో రెసిడెన్షియల్ హాస్టల్స్ రెండు ఉండగా మిగిలినవి వసతి గృహాలు. బాలికల వసతి గృహాలు నాలుగు ఉన్నాయి. వీటిల్లో రక్షణ అంతంతమాత్రంగానే ఉంది. నరసన్నపేటలోని బీసీ బాలికల కళాశాల వసతి గృహం ప్రైవేటు భవనంలో నిర్వహిస్తున్నారు. వసతి గృహం చెంతనే మురుగు కాలువ ఉండటం వల్ల తరుచూ విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారు. సవరబొంతు ఆశ్రమ పాఠశాలలో వార్డెన్లు లేరు. టీచర్లే నెలకొకరు చొప్పున వార్డెన్ బాధ్యతలు చూస్తున్నారు. నైట్ వాచ్‌మెన్లు లేకపోవడంతో పిల్లల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. శ్రీముఖలింగం బీసీ బాలుర వసతి గృహంలో ఇన్వర్టర్ లేదు. వసతి గృహం వార్డెన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. దీంతో పర్యవేక్షణ కొరవడుతోంది.

ఎస్సీ బాలికల వసతి గృహాలు	31
చదువుకుంటున్న పిల్లలు	2369
మరమ్మతులకు గురైన వసతి గృహాలు	31
కావల్సిన నిధులు	రూ.4కోట్ల 32లక్షల 56వేలు
6నెలలుగా చెల్లించాల్సిన కాస్మొటిక్స్ చార్జీలు	రూ.21 లక్షలు
8 నెలలుగా అందని మెస్ బిల్లులు	రూ.8కోట్లు

మొత్తం బీసీ వసతి గృహాలు	చదువుకుంటున్న పిల్లలు	ప్రభుత్వ భవనాలు	మరమ్మతులకు గురైన బీసీ వసతి గృహాలు	మరమ్మతులకు గురైన బాలురు వసతి గృహాలు	మైనర్ రిపేర్లకు అయ్యే వ్యయం అంచనా	మేజర్ రిపేర్లకు అయ్యే వ్యయం అంచనా.	మరమ్మతుకు గురైన బాలికల వసతి గృహాలు	మైనర్ రిపేర్లకు అయ్యే వ్యయం అంచనా	మేజర్ రిపేర్లకు అయ్యే వ్యయం అంచనా	కాస్మొటిక్ చార్జీల బకాయిలు	మెస్‌చార్జీల బకాయిలు
81	7,899	52	58	47	రూ. 3.35కోట్లు	రూ. 4.65కోట్లు	11	రూ.81.25లక్షలు	కోటి 14లక్షల 70వేలు	రూ.39లక్షలు	రూ. 15.6కోట్లు

అపార్ నమోదు చేసుకోవాల్సిందే: కలెక్టర్



కళాశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో అపార్ నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. సోమవారం శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ బాలికల కళాశాలలో జరుగుతున్న అపార్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. కళాశాలలో 1277 మంది బాలికలు చదువుతుండగా.. అపార్ కార్డు నమోదు పెండింగ్‌లో ఉన్నవారి చాలా ఎక్కువగా ఉండటంతో సంబంధిత అధికారులను నిలదీశారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడారు. ఆధార్‌లో జనన నమోదు పొరపాటుగా ఉందని, దానికి సచివాలయాలు, నోటరీ కోసం అడ్వకేట్లు, ఆధార్ కేంద్రాల చుట్టూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తిరుగుతున్నట్లు కలెక్టర్ గుర్తించారు. అపార్ నమోదు అనేది విద్యార్థికి భవిష్యత్‌లో అత్యంత ఉపయుక్తమైన ప్రక్రియ అని, దీనిని పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రతి అధికారిపైన ఉందన్నారు. జిల్లాలో 1 నుంచి 10వ తరగతి వరకు 'అపార్' నమోదు ప్రక్రియ 80 శాతం పూర్తయ్యిందని, కానీ ఇంటర్మీడియెట్‌లో మాత్రం 20 శాతం మాత్రమే పూర్తయ్యిందని వెంటనే పూర్తిచేయాలని అధికారులకు ఆదేశించారు.

వారం పాటు ఉద్దానం నీరు బంద్

ఇచ్ఛాపురం రూరల్: న్యూ ఉద్దానం ప్రాజెక్ట్ ద్వారా గ్రామాలకు సరఫరా అవుతున్న తాగునీరు వారం రోజుల పాటు సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్దానం ప్రాజెక్ట్ ఏఈఈ కె.ముఖేష్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొంటూ స్థానిక 16వ జాతీయ రహదారి కుంటికోట వద్ద మెయిన్ పైప్‌లైన్ 800ఎంఎం డయా డీఐకె9 లీకేజీ వర్క్ జరుగుతున్నందున నేటి నుంచి వారం రోజుల పాటు సరఫరా నిలిపివేస్తున్నందున ప్రజలు సహకరించాలని కోరారు.

నేటి నుంచి బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని 14 బీఎడ్ కళాశాలలకు సంబంధించి ఎనిమిది పరీక్ష కేంద్రాల్లో మంగళవారం నుంచి రెండో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభ కానున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎగ్జామినేషన్ పోస్టు గ్రాడ్యుయేషన్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజాం జీసీఎస్ఆర్, బీఆర్‌ఏయూలోని ఆర్ట్స్, ఇంజినీరింగ్ కాలేజీ, టెక్కలి, పలాస డిగ్రీ కళాశాలల్లో పరీక్షలు నిర్వహించనున్నారు.

క్రిమినల్ కేసులపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులపై దృష్టి సారించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ఆయన సోమవారం స్థానిక జిల్లా కోర్టు భవనంలో జిల్లా పోలీసు అధికారులు, ఎక్సైజ్ అధికారులు, లేబర్, విద్యుత్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. డిసెంబర్ 14వ తేదీ జరగనున్న లోక్ అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ కేసులను ఎక్కువ చేయాలని కోరారు. అలాగే జైల్లో గల ముద్దాయిలు గురించి చర్చిస్తూ వారి స్థితిగతులను త్వరితగతిన పరిష్కారం చేయాలని తెలిపారు.



శ్రీకాకుళం నాగావళి తీరంలో సాయం సంధ్య వేళ శివ దర్శనం



జలుమూరు: శ్రీముఖలింగంలో పూజలు అందుకుంటున్న స్వామి వారు

● నమో రుద్రాయ

పవిత్ర కార్తీక సోమవారం నాడు జిల్లాలోని శైవక్షేత్రాలన్నీ కిటకిటలాడాయి. అభిషేక ప్రియుడికి ఊరూరా పంచామృతాలతో అభిషేకార్చనలు నిర్వహించారు. వేకువ జాము నుంచే ప్రతి ఆలయం వద్ద భక్తులు బారులు తీరి కనిపించారు.



టెక్కలి: రావివలస ఎండల మల్లికార్జునస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పైసా వసూల్


- ప్రభుత్వ ర్యాంపుల్లో అక్రమ వసూళ్లు
- ఫోన్ పే ద్వారా ఇసుక కప్పం వసూలు
- ఫిర్యాదులు చేసినా మారని పరిస్థితులు
- ఫిర్యాదుచేసినందుకు మరింత రేటు పెంచిన వైనం



కలెక్టర్ గ్రీవెన్స్‌లో సోమవారం మరోసారి ఫిర్యాదు చేస్తున్న లారీ యజమానులు



ఇసుక ర్యాంపుల్లో జరుగుతున్న అవినీతి బాగోతానికి సాక్ష్యమిది. గార ర్యాంపులో ఉన్న గోగినేని ప్రేమ్‌సాగర్ అనే వ్యక్తి ఇసుక కోసం వచ్చిన వారి నుంచి రూ.10వేలు ఫోన్ పే చేయించుకున్న స్క్రీన్ షాట్ ఇది. ఈ ర్యాంపునకు వచ్చే వారిలో దాదాపు ఈయనకు ఫోన్ పే చేస్తున్నారు. అదనంగా సీనరేజీ చార్జీ చలానా ద్వారా అధికారికంగా వసూలు చేస్తున్నారు.



ఇసుక లారీ యజమాని చేత ఇసుక కోసం ఫోన్ పే చేయించుకున్న స్క్రీన్ షాట్ ఇది. బూర్జ మండలం నారాయణపురంలో కేతా సాయి కుమార్ తనకు ఫోన్ పే ద్వారా రూ.20వేలు వేయించుకుని జరిపిన లావాదేవీ ఇది. దాదాపు ఇక్కడ లావాదేవీలన్నీ ఈయన అకౌంట్ ద్వారానే జరుగుతున్నాయి. దీనికి అదనంగా సీనరేజీ చార్జీని చలానా ద్వారా తీసుకుంటున్నారు.



ఇసుక ర్యాంపులో ఉంటున్న పిండి అప్పన్న అనే వ్యక్తి ఇసుక కోసం వచ్చిన వారి నుంచి రూ.13 వేలు ఫోన్ పే చేయించుకున్న స్క్రీన్ షాట్ ఇది. తనకు ఫోన్ పే చేసిన తర్వాతే లోడింగ్ కోసం లారీని ర్యాంపులోకి అనుమతించారు. అనధికారికంగా తీసుకున్న మొత్తానికి అదనంగా సీనరేజీ చార్జీని చలానా ద్వారా తీసుకుంటున్నారు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ప్రభుత్వం అధికారికంగా కట్టబెట్టిన ఇసుక ర్యాంపుల్లో పైసా వసూల్ జరుగుతోంది. ర్యాంపుల్లో అక్రమాలు జరగడం లేదని బుకాయించడానికేమీ లేదు. ఇసుక ర్యాంపుల్లో ప్రైవేటు వ్యక్తులు చెలరేగిపోతున్నారన్నడానికి అక్కడ జరుగుతున్న అనధికార లావాదేవీలే నిదర్శనాలు. తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోయి దోపిడీ చేస్తున్నారు.



ఫిర్యాదు చేసినందుకు పనిష్మెంట్

10టైర్ల లారీకి రూ.12వేలు, 12టైర్ల లారీకి రూ.14వేలు, 14 టైర్ల లారీకి రూ.16వేలు, 16టైర్ల లారీకి రూ.18వేలు చొప్పున ఇసుక ర్యాంపుల్లో అనధికారికంగా వసూలు చేస్తున్నారని గత సోమవారం మూడు లారీ అసోసియేషన్ యజమానులు మూకుమ్మడిగా కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దానికి పనిష్మెంట్‌గా లారీ లోడ్‌కి అదనంగా మరో రూ. 2వేలు పెంచారు. అంతమొత్తం ఇస్తే తప్ప ఇసుక ఇవ్వలేమని మొండికేస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేస్తే ఇలాగే ఉంటుందని తమ తడాఖా ఏంటో ర్యాంపు నిర్వాహకులు చూపించారు. అధికారులు కూడా వారికి వంత పాడినట్టు ఫిర్యాదును పక్కన పడేసి చోద్యం చూశారు.

మళ్లీ ఫిర్యాదు

కూటమి ప్రభుత్వం వచ్చాక జరుగుతున్న ఇసుక దోపిడీపై లారీ యజమానులు మరోసారి ఫిర్యాదు చేశారు. గత సోమ వారం ఫిర్యాదు చేసినా స్పందన లేదని, అక్రమ వసూళ్లలో మార్పు లేదని సరికదా ఇంకా పెంచారని తాజాగా సోమవారం గ్రీవెన్స్‌లో మరో సారి లారీ యజమానుల అసోసియేషన్ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ సారి ఏయే ర్యాంపుల్లో ఎంతెంత వసూలు చేశారో పక్కా ఆధారాలతో ఫిర్యాదు చేశారు. ఎప్పుడూ ఇలాంటి పరిస్థితులు చూడలేదని అన్నారు. ఫోన్ పేకు అమౌంట్ వేయించుకుని బిల్లులైనా ఇవ్వలేదన్నారు.

ఇలా అయితే వ్యాపారాలు చేయలేం

గార: విశాఖపట్నంకు వెళ్లే ఇసుక ధరలను తగ్గించకపోతే వ్యాపారాలు చేయలేమని ఆ జిల్లాకు చెందిన పలు లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు. సోమవారం సాయంత్రం గార ఇసుక ర్యాంపు వద్దకు చేరుకొని సిబ్బందితో మాట్లాడారు. 10 టైర్ల లారీ నుంచి రూ. 10 వేలు వసూలు చేస్తున్నారని, విశాఖకు తీసుకెళ్లి అమ్మకాలు చేయడంతో ఇసుక కస్టమర్లు కొనేందుకు ముందుకు రావడం లేదన్నారు. దీనిపై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఇసుక అధిక లోడింగ్‌కు అవకాశం ఇవ్వవద్దని, అలా ఏమైనా వాహనం దొరికితే అలాంటి వారికి అసోసియేషన్ మద్దతు పలకదని స్పష్టం చేశారు. బిల్లు వద్దన్న వాహనదారులను ప్రోత్సహించవద్దని కోరారు.

క్లుప్తంగా

విధుల్లో చేరిన ఎస్‌బీ డీఎస్పీ



ఎస్పీకి మొక్కను బహూకరిస్తున్న ఎస్‌బీ డీఎస్పీ సీతారామారావు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా స్పెషల్ బ్రాంచి డీఎస్పీగా జి.సీతారామారావు సోమవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. ఈయన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. అనంతరం ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

బాధ్యతలు స్వీకరించిన అడిషనల్ ఎస్పీ



అడిషనల్ ఎస్పీ కె.వి.రమణ

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు శాఖ అదనపు ఎస్పీ (అడ్మిన్ విభాగం)గా కె.వి.రమణ సోమవారం ఉదయం తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇంతకుముందు పనిచేసిన అదనపు ఎస్పీ డాక్టర్ జి.ప్రేమ్‌కాజల్ బదిలీ అయిన సంగతి తెలిసిందే. కె.వెంకటరమణ కోనసీమ జిల్లా కొత్తపేట ఎస్‌డీపీవో (డీఎస్పీ)గా ఉంటూ ఇటీవలే అదనపు ఎస్పీగా ఉద్యోగోన్నతి పొంది, రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాకు వచ్చారు. 1991 ఎస్‌ఐ బ్యాచ్‌కు చెందిన ఈయన విశాఖ సిటీలో ఎక్కువ కాలం పనిచేశారు.

విభిన్న ప్రతిభావంతులకు ఆటల పోటీలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: డిసెంబర్ 3వ తేదీన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం జిల్లాలో గల విభిన్న ప్రతిభావంతులకు కేటగిరీల వారీగా స్త్రీ, పురుషులకు వేరు వేరుగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ కె.కవిత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు కలెక్టరేట్ దగ్గరలో, డి.ఆర్.డి.ఎ కాంప్లెక్స్ ఎదురుగా గల, డచ్ భవనం ఎదురు మైదానంలో ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తామని తెలిపారు.

డిగ్రీ మూడో సెమిస్టర్ ప్రయోగ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ మూడో సెమిస్టర్ ప్రయోగ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నెల 23వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ సీనియర్ అధ్యాపకులను ఎగ్జామినర్లుగా జంబ్లింగ్ పద్ధతిలో నియమించినట్లు అండర్ గ్రాడ్యుయేషన్ ఇన్‌చార్జి డీన్ జి.పద్మారావు చెప్పారు.

పలు అంశాల్లో విద్యార్థులకు పోటీలు

ఎచ్చెర్ల క్యాంపస్: సంకల్పం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించనున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ పి.సుజాత అన్నారు. వర్సిటీ నుంచి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, దుర్వినియోగం, గంజాయి వినియోగం, చిన్నారులు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, డ్రంక్ అండ్ డ్రైవ్, సైబర్ క్రైమ్ వంటి అంశాలపై పోస్టర్ తయారీ, వీడియో లఘుచిత్రాలు అంశంపై పోటీ ఉంటుందని చెప్పారు. ఈ నెల 25వ తేదీలోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని, నోడల్ అధికారి జేఎల్ సంధ్యారాణి ఫోన్ నంబర్ 9866027906లను సంప్రదించాలని అన్నారు.

ఎస్‌జీటీ ఓవరాక్షన్‌పై ఫిర్యాదు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో పలాస మండల పరిధిలోని ఎంపీయూపీ స్కూల్‌లో ప్రస్తుతం సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న తమ్మినాన శ్రీనివాసరావు డీఈవో కార్యాలయంలో చేసిన ఓవరాక్షన్‌పై ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ జిల్లాశాఖ (ఏపీఎస్ఈఎస్ఏ) ప్రతినిధులు మండిపడుతున్నారు. ఈనెల 7వ తేదీన సదరు ఎస్‌జీటీ శ్రీనివాసరావు డీఈవో కార్యాలయానికి వచ్చి నాన్ టీచింగ్ స్టాఫ్‌పై దుర్భాషలాడుతూ దౌర్జన్యంగా ప్రవర్తించినట్లు సంఘ ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ఎంపీయూపీ స్కూల్ పెద్దరోకల్లపల్లి ఎస్‌జీటీగా పనిచేస్తున్న సమయంలో మరో ఉపాధ్యాయుడితో జరిగిన ఘర్షణ కారణంగా శ్రీనివాసరావు సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఈ నేపథ్యంలో ఘర్షణ జరిగిన మరో ఉపాధ్యాయుడి పోస్టింగ్‌కు అనుకూలంగా డీఈవో కార్యాలయ సిబ్బంది పనిచేశారనే నెపంతో వారిపై విరుచుకుపడ్డారు. వారి అంతు చూస్తానని.. వారి అందరిపై లెటర్‌రాసి చస్తానంటూ భయపెట్టడంతో విషయాన్ని డీఈవో డాక్టర్ తిరుమల చైతన్య దృష్టికి తీసుకెళ్లారు. సంఘటన జరిగి రెండు వారాలు కావొస్తున్నా సదరు ఉపాధ్యాయుడిపై డీఈవో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో సోమవారం ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ ప్రతినిధులు(ఏపీఎస్ఈఎస్ఏ) జిల్లా కలెక్టర్‌ను ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ లియాకత్ ఆలీఖాన్, గోపాలకృష్ణ త్రిపాఠి, ఆరుగు పటా్నయక్, సూర్యప్రకాష్, రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే తొలగింపులు

టెక్కలి నియోజకవర్గంలో కోటబొమ్మాళి, నందిగాం, టెక్కలి, సంతబొమ్మాళి మండలాల్లో కేవలం రాజకీయ కక్షతోనే 21 మంది ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారని వారు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ముందస్తు నోటీసు కూడా ఇవ్వలేదని, అధికారులు పాలకులకు తొత్తులుగా మారి కనీస దర్యాప్తు చేయకుండా విధుల నుంచి తప్పించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే శ్రీకాకుళం మండలం రాగోలు వద్దనున్న అర్బన్ లే అవుట్(జగనన్న కాలనీ)లో వసతులు కల్పించాలని లబ్ధిదారులు విన్నవించారు. అదేవిధంగా అపార్ నమోదు చేసేందుకు గడువు ఉన్నప్పటికీ ఉపాధ్యాయులను ఒత్తిడికి గురి చేస్తున్నారని, అపార్ నమోదుకి సాంకేతిక లోపాలు చాలా ఉన్నాయని, అందువలన ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయడం తగదని ఉపాధ్యాయ సంఘాల నేతలు కలెక్టర్‌కి వినతి అందజేశారు.



ఫిర్యాదు అందజేయడానికి వచ్చిన ఫీల్డ్ అసిస్టెంట్లు

అర్జీల జోరు.. నిరసనల హోరు



వినతులు స్వీకరిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

- ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికకు 73 అర్జీలు
- మరోవైపు వివిధ వర్గాల నిరసనలు

శ్రీకాకుళం పాతబస్టాండ్:

అర్జీలు పెండింగ్‌లో లేకుండా చూడాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికను జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. దీనిలో భాగంగా అర్జీదారుల నుంచి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ 73 అర్జీలు స్వీకరించారు. స్వీకరించిన అర్జీలలో అత్యధికంగా రెవెన్యూ సమస్యలపై 30, పంచాయతీరాజ్ సమస్యలపై 12 ఉన్నాయి. ఫిర్యాదుల స్వీకరణలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వేంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, జెడ్పీ సీఈవో ఎల్.ఎన్.వి.శ్రీధర్ రాజ పాల్గొన్నారు.

పెత్తందారులను అరెస్టు చేయాలి

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్



జిల్లా పరిషత్ వద్ద ధర్నా చేస్తున్న బాధితులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కోటబొమ్మాళి మండలం కృష్ణాపురం గ్రామ దళితులు చల్ల దమయంతి, చల్ల అప్పలరాజులపై దాడి చేసిన పెత్తందారులను వెంటనే అరెస్టు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జోగి గన్నయ్య, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగరావు సింహాచలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా పరిషత్‌లో గ్రీవెన్స్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దళితులపై దాడి జరిగి నెల రోజులు గడుస్తున్నా నేటికీ నిందితులను అరెస్టు చేయకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు సొంత మండలంలో దళితులపై దాడి జరిగినా స్పందించకపోవడం బాధాకరమని వాపోయారు. స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్ రాజకీయ ఒత్తిడికి లొంగిపోయి బాధితులైన దళితులను భయ భ్రాంతులకు గురి చేసిన విషయం ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ధర్నాలో బాధితురాలు చల్ల దమయంతి, చల్ల అప్పలరాజు, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు భవిరి కృష్ణమూర్తి, కాల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలతో తీవ్రనష్టం

- జ్యోతీరావు పూలే విగ్రహం వద్ద 108 కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న 108 ఉద్యోగులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: అత్యవసర సేవలు అందించే 108 సేవలను ఏజెన్సీలకు అప్పగించడం వలన తమకు తీవ్ర నష్టం జరుగుతోందని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద 108 ఉద్యోగులు సీఐటీయూ సారథ్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అత్యవసర సేవలు అందించే 108 ఉద్యోగులకు న్యాయం చేయాలని, ఈ సేవలు ఇతర సంస్థలకు అప్పగించకుండా రాష్ట్ర ప్రభుత్వం నేరుగా నిర్వహించాలని కోరారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 25వ తేదీ తర్వాత సమ్మెకు సిద్ధమవుతామని హెచ్చరించారు. గతంలో అధికారులు ఇచ్చిన హామీ మేరకు స్లాబ్ ప్రకారం అందరికీ వేతనాలు చెల్లించాలని, ఎప్పటికప్పుడు స్లాబ్‌లను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. ఈఎంటీ పోస్టులో 108 ఈఎంటీలను నియమించి, ఇతర ఖాళీల్లో అర్హత ఆధారంగా పోస్టింగ్‌లు ఇవ్వాలని విన్నవించారు. టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడంతో పాటు జీవో నంబర్ 49ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో 108 సంఘం అధ్యక్షుడు బి.కృష్ణకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.శ్రీనివాసరావు, కార్యదర్శి కేవీవీ నర్సింగరావు, ఎన్.మహేశ్, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్ కార్యాలయం వద్ద ఆశా వర్కర్ల ధర్నా

శ్రీకాకుళం పాతబస్టాండ్: తమ సమస్యలు పరిష్కరించాలని ఆశా కార్యకర్తలు కోరారు. ఈ మేరకు ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ముందుగా ఆర్–బంగ్లా రోడ్ నుంచి ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు కె.నాగమణి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.ధనలక్ష్మి, జి.అమరావతి మాట్లాడుతూ.. ఆశాలకు సంబంధం లేని పనులు అప్పగించరాదని స్పష్టం చేశారు. రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంపుదల జీవో వెంటనే విడుదల చేయాలని, జీవో ఇచ్చేవరకూ 60 సంవత్సరాలు నిండిన ఆశాల రిటైర్మెంట్ ఆపాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రికార్డులు వెంటనే ఇవ్వాలని, పనిచేసే సెల్‌ఫోన్లు ఇవ్వాలని, మట్టి ఖర్చులకు రూ.20 వేలు ఇవ్వాలని కోరారు. ధర్నా వద్దకు అదనపు డీఎంఅండ్‌హెచ్‌వో బి.సత్యవాణి వచ్చి తమ పరిధిలోని సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నగర కన్వీనర్ ఆర్.ప్రకాష్, ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.లావణ్య, స్వర్ణలత, దమయంతి, సుజాత, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 50 ఫిర్యాదులు



మహిళ సమస్య వింటున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం పరిష్కార వేదిక (ఎస్పీ గ్రీవెన్స్)లో అర్జీదారుల నుంచి 50 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అర్జీలను స్వీకరించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

పోరాటం ఉద్ధృతం చేస్తాం



అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న కార్మికులు

- 6వ రోజు మున్సిపల్ కార్మికుల సమ్మె

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శానిటరీ మేస్త్రీలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, లేకుంటే పోరాటం ఉద్ధృతం చేస్తామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కల్యాణి అప్పలరాజు, అధ్యక్షుడు కె.వేణుగోపాల్‌రావులు మున్సిపల్ అధికార యంత్రాంగాన్ని హెచ్చరించారు. శానిటరీ మేస్త్రీలను అకారణంగా తొలగించడాన్ని నిరసిస్తూ మున్సిపల్ శానిటరీ మేస్త్రీలు, పారిశుద్ధ్య కార్మికులు 6వ రోజు సోమవారం అర్ధనగ్నంగా శ్రీకాకుళం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరంలో చెత్త పేరుకుపోయి ప్రజారోగ్యాలు పాడైపోతున్నా అధికారులు పరిష్కారం చూపకపోవడం దారుణమన్నారు. అధికారులు వెంటనే కళ్లు తెరిచి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మేస్త్రీల సంఘం అధ్యక్షుడు ముద్దాడ రామారావు, అల్లు రవి, టొంపల షణ్ముఖరావు, మున్సిపల్ యూనియన్ నాయకులు జె.గురుమూర్తి, ఎస్ పార్థసారథి, ఆర్.గణేష్, అర్జీ పెద్దమనేద్ర, తారక, డి.రమణ, రసూల్, సోగ్గాడు, కె.తిరుమల రావు, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పైలెట్లుగా ఉండాలి

- కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు



విద్యార్థినులతో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం న్యూకాలనీ: మహిళలు పైలట్లుగా ఉండాలనే సరికొత్త లక్ష్యంతో అడుగులు వేస్తున్నామని కేంద్ర పౌర విమానయానశాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఉమెన్ ఇన్ ఏవియేషన్ ఇండియా ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఏవియేషన్ డే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీకాకుళం జిల్లా ప్రజలు ఎక్కడున్నా.. ఏ రంగంలో ఉన్నా కష్టపడి పనిచేస్తారన్నారు. దీనికి మరింత నైపుణ్యం జోడిస్తే అన్ని రంగాల్లో రాణించవచ్చని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కేవలం 5 శాతం మంది మాత్రమే మహిళా పైలెట్లు ఉండగా, భారతదేశంలో 15 శాతం మంది ఉండడం గొప్ప విషయమన్నారు 'బేటీ కీ ఉడాన్.. దేశ్ కా స్వాభిమాన్' అనేది విమానయాన శాఖ ధ్యేయమని, యువతులను విమానయాన శాఖలోని మరిన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకు సహకారం అందిస్తున్నామని పేర్కొన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టుతో పాటు మూలపేట పోర్టు నిర్మాణం పూర్తయితే జిల్లాలోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఉమెన్ ఇన్ ఏవియేషన్ ఇండియా సంస్థ ఉపాధ్యక్షురాలు కమల చక్రవర్తి, సభ్యులు అంజలి చౌహా, అర్చన, కీర్తి తివారి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ పి.శంకర్‌నారాయణ, సీహెచ్ కృష్ణారావు, పద్మావతి, మెట్ట సుజాత తదితరులు పాల్గొన్నారు.

కొజ్జీరియాలో వైద్య బృందం స్పెషల్ డ్రైవ్



ఇంటింటా సర్వే చేపడుతున్న దృశ్యం

కవిటి: మండలంలోని కొత్త కొజ్జిరియాలో ఇటీవల కాలంలో పెద్ద సంఖ్యలో మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు రావడంతో పాటు, కీళ్ల నొప్పులతో ప్రజలు బాధపడుతున్నారని స్థానికుల ఫిర్యాదుతో జిల్లా వైద్యారోగ్యశాఖ స్పందించింది. దీనిలో భాగంగా సోమవారం గ్రామంలో జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో వైద్య బృందం వచ్చి స్పెషల్ డ్రైవ్ ప్రారంభించింది. గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జ్వరాలకు కారణమైన దోమల నివారణ చర్యలు తీసుకున్నారు. స్థానిక బెలగాం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.రాకేష్, డాక్టర్ కవితల ఆధ్వర్యంలో వైద్య బృందం ఇంటింటికీ సర్వే నిర్వహించారు. పెద్ద సంఖ్యలో జ్వర పీడితులను గుర్తించి మలేరియా, డెంగీ పరీక్షలు చేపట్టారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సబ్ యూనిట్ అధికారి నల్లాన లక్ష్మీనారాయణ సూచించారు. స్థానిక సచివాలయం సిబ్బంది ఫ్రైడే డ్రై డే రోజు నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ మలేరియా అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించండి



ర్యాలీగా వెళ్తున్న హమాలీలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సివిల్ సప్లయ్ హమాలీల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఏపీ సివిల్ సప్లయ్ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిక్కాల గోవిందరావు డిమాండ్ చేశారు. స్థానిక సివిల్ సప్లయ్ గోడౌన్ వద్ద యూనియన్ పిలుపు మేరకు సోమవారం హమాలీలు ధర్నా నిర్వహించి, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ.. గతేడాది డిసెంబర్‌లో హమాలీల కూలీ రేట్ల అగ్రిమెంట్ ముగిసినా, నేటికీ కొత్త కూలీ రేట్ల అగ్రిమెంట్ చేయకుండా సంబంధిత అధికారులు కాలయాపన చేయడం సరికాదన్నారు. హమాలీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని, వెంటనే కొత్త కూలీ రేట్లుతో అగ్రిమెంట్ ఇవ్వాలని కోరారు. కూలీ డబ్బులు కూడా సకాలంలో అకౌంట్లలో జమ అవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదవీ విరమణ చేసిన హమాలీల పీఎఫ్ డబ్బులు సకాలంలో రావడం లేదని తెలిపారు. కొత్తగా చేరినవారి పేర్లు రికార్డుల్లో నమోదు చేసి పీఎఫ్ అమలు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసనలో సంఘ అధ్యక్షుడు శ్రీమన్నారాయణ, ఎంఎల్ఎస్ గోడౌన్ మేస్త్రీలు గౌరీ శంకర్, కృష్ణారెడ్డి, రామారావు, సీహెచ్ సతీష్, జి.దుర్యోధన, రాము, సీతయ్య, కామరాజు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధిలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బలరాంపేటకు చెందిన ఉయ్యాల వంశీకృష్ణ(24) ఇచ్ఛాపురం సీహెచ్‌సీలో చికిత్స పొందుతూ మృతి చెందగా, అతని బావ కృష్ణ బరంపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున మృతి చెందినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. దీంతో ఇరువురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. పట్టణ ఎస్‌ఐ ఇ.చిన్నంనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోటు బోల్తాపడి వ్యక్తి మృతి



మృతుడు అనిల్ కుమార్ (ఫైల్)

రణస్థలం: మండలంలోని అల్లివలస గ్రామానికి చెందిన వాసుపల్లి అనిల్ కుమార్(34) బోటు బోల్తా పడడంతో మృతి చెందాడు. జే.ఆర్.పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. సోమవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో మృతుడు వాసుపల్లి అనిల్ కుమార్‌తో పాటు మరో ఇద్దరు యర్రయ్య, గుంటు అమ్మోరు సముద్రంలో వేటకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 12 గంటల సమయంలో తీరానికి వంద మీటర్ల దూరంలో భారీ కెరటానికి పడవ బోల్తా పడడంతో అనిల్ కుమార్ సముద్రంలో మునిగి మృతి చెందాడు. మిగతా ఇద్దరు ఒడ్డుకు చేరుకున్నారు. తదుపరి గ్రామస్తుల సహకారంతో అనిల్ మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మృతుడికి భార్య లక్ష్మి, రెండేళ్ల కుమారుడు జయ ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జే.ఆర్.పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డిమందు తాగి రైతు ఆత్మహత్య

కాశీబుగ్గ: పలాస మండలం టెక్కలిపట్నం పంచాయతీ బంజీరుపేట గ్రామానికి చెందిన కొర్ల పాపారావు(62) అనే రైతు ఆత్మహత్య చేసుకుని మరణించాడు. ఆదివారం తన పంటపొలానికి వెళ్లి గడ్డిమందు తాగి పడిపోవడంతో గమనించిన భార్య కొర్ల నారాయణమ్మ గ్రామస్తులకు సమాచారం అందించడంతో 108కు ఫోన్ చేసి టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్య సేవల కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆత్మహత్య ఎందుకు చేసుకోవడానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దీనిపై కాశీబుగ్గ ఎస్‌హెచ్‌ఓ సీఐ మోహనరావు కేసు నమోదు చేశారు.

● మర్యాదపూర్వక భేటీ



మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జెడ్పీ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా విజయ, ఆమె భర్త, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్‌లు సోమవారం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులపై చర్చించారు. - కంచిలి

సివిల్స్‌కు ఉచిత కోచింగ్

శ్రీకాకుళం పాత బస్టాండ్ : యూపీపీఎస్సీ సివిల్స్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల ఉచిత శిక్షణ పొందగోరు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఈ.అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తులను పూర్తి చేసి, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ స్టడీ సర్కిల్ శ్రీకాకుళంకు స్వయంగా వచ్చి తమ బయోడేటాతో పాటు 2 ఫొటోలు, విద్య, కుల, ఆదాయం, ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, పాన్‌కార్డ్, జిరాక్స్‌లను దరఖాస్తుకు జతపరచి ఈనెల 24 వ తేదీలోపు అందజేయాలని కోరారు. స్క్రీనింగ్ టెస్ట్ ప్రాతిపదికన అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని, ఎంపికైన అభ్యర్థులకు బీసీ భవన్, గొల్లపూడి, విజయవాడలో ఉచిత శిక్షణ ఇవ్వడానికి ప్రత్యేక స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత బస, వసతి సౌకర్యాలు ఉంటాయన్నారు. స్క్రీనింగ్ టెస్ట్ ఈనెల 27 తేదీన నిర్వహించనున్నట్లు చెప్పారు. వివరాలకు 8332852106, 7382975679 నంబర్లను సంప్రదించాలని కోరారు.

జనసమూహాలున్న చోట మరుగుదొడ్లు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జన సమూహాలు అధికంగా ఉండే చోట్ల మరుగుదొడ్లు తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. జల్ జీవన్ మిషన్, స్వచ్ భారత్ మిషన్ గ్రామిన్, డిస్ట్రిక్ట్ వాటర్ అండ్ శానిటేషన్ మిషన్‌లపై ఆయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలసి సోమవారం సమీక్షించారు. మేజర్ పంచాయతీలు, గ్రామాలతో సంబంధం లేకుండా క్రౌడ్ ఉన్న దేవాలయాల వద్ద మరుగుదొడ్లు నిర్మించి రన్నింగ్ వాటర్ ఉండేలా చూడాలని డీపీఓను ఆదేశించారు. క్రౌడ్ ఉన్న ముఖ్య ప్రాంతాల్లో మరుగుదొడ్లు లేకపోతే మరుగుదొడ్లు నిర్మించి రన్నింగ్ వాటర్ ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. పబ్లిక్ భవనాల వద్ద మరుగుదొడ్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. జిల్లాలో ఉన్న రైల్వే స్టేషన్ దగ్గర మరుగుదొడ్లు ఉండేటట్లు చూడాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో కొత్తగా మరుగుదొడ్లు నిర్మాణం, మరుగుదొడ్ల వద్ద బ్యూటిఫికేషన్, రన్నింగ్ వాటర్ ఉండాలని, పరిశుభ్రత చేయాలని ఆదేశించారు.